క్లుప్తంగా

రేపు విద్యుత్తు ఉండని ప్రాంతాలు

అక్కిరెడ్డిపాలెం: 33/11 కేవీ శీలానగర్ ఎస్‌ఎస్‌లో మరమ్మతుల దృష్ట్యా శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని జోన్–2 ఈఈ బి.కె.నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. శీలానగర్, గవర జగ్గయ్యపాలెం, వెంకటేశ్వర కాలనీ, హరిజన జగ్గయ్యపాలెం, పోర్టు రోడ్డు ఏరియా, కిమ్స్ ఐకాన్ హాస్పిటల్ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

గాజువాక ఫీడర్ పరిధిలో..

పెదగంట్యాడ: 11కేవీ గాజువాక ఫీడర్ మరమ్మతుల నేపథ్యంలో ఈ నెల 29న విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామని ఏపీఈపీడీసీఎల్ జోన్–2 ఈఈ బీకే నాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఫీడర్ పరిధిలోని యాతపాలెం, దిబ్బపాలెం కాలనీ, అశోక్‌నగర్, ప్రియదర్శినీ కాలనీ ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

చినగంట్యాడ సబ్‌స్టేషన్ పరిధిలో..

గాజువాక: చినగంట్యాడ విద్యుత్ సబ్ స్టేషన్‌లో శుక్రవారం నిర్వహణ పనులను చేపట్టనున్నట్టు ఏపీఈపీడీసీఎల్ జోన్–2 ఈఈ బి.కె.నాయుడు తెలిపారు. ఈ కారణంగా శ్రామికనగర్, డ్రైవర్స్ కాలనీ, ఎర్రగెడ్డ కాలనీ, శ్రీనివాసనగర్, దత్తసాయి నగర్ కాలనీలకు ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

వైభవంగా గరుడ వాహన సేవ



గరుడ వాహనంపై శ్రీవారు

అక్కిరెడ్డిపాలెం: శీలానగర్ ఎస్టీబీఎల్‌లోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో శ్రీవారికి గరుడ వాహనసేవను కనులపండువగా జరిపించారు. శ్రీనివాసుడిని గరుడవాహనంపై కొలువుదీర్చి, తిరువీధి ఉత్సవం నిర్వహించారు. దివ్యక్షేత్రం ట్రస్ట్ ప్రతినిధుల పర్యవేక్షణలో ఈ కార్యక్రమాలు జరిగాయి.

కరాటేలో పతకాల పంట



ట్రోఫీతో విశాఖ క్రీడాకారులు

గాజువాక : ఈ నెల 22 నుంచి 26 వరకు పశ్చిమ బెంగాల్‌లో నిర్వహించిన 23వ జాతీయ స్థాయి కరాటే పోటీల్లో విశాఖకు చెందిన చిన్నారులు సత్తా చాటారు. కెన్యు ర్యు కరాటే అసోసియేషన్ ద్వారా ఈ పోటీలకు హాజరైన 34 మంది విద్యార్థులు కాటా, కుమిటీ విభాగాల్లో 48 బంగారు పతకాలు, 14 రజత పతకాలు, 6 కాంస్య పతకాలను సొంతం చేసుకున్నారు. జాతీయ కోచ్ కోరాడ సుమన్, కోచ్‌లు ధనుంజయ్, శివ ప్రసాద్ ఆధ్వర్యంలో వారు ఈ పోటీలకు హాజరయ్యారు. పతకాలు సాధించి, విశాఖ తిరిగి వచ్చిన బాలబాలికలను పలువురు అభినందించారు.

ప్రైవేటీకరణను విరమించే వరకూ ఉద్యమం

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను కేంద్ర ప్రభుత్వం విరమించే వరకు ఉక్కు ఉద్యమం కొనసాగుతుందని పోరాట కమిటీ నాయకులు అన్నారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న రిలే నిరాహారదీక్ష శిబిరంలో 1049వ రోజు, బుధవారం పలువురు కార్మికులు పాల్గొని, కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

రెండో రోజూ అదే జోష్

జోరుగా 'ఆడుదాం-ఆంధ్రా'



ఐలా గ్రౌండ్‌లో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జెడ్సీ సింహాచలం



నడుపూరు హైస్కూల్లో వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ వంశీరెడ్డి



ఆదర్శ గ్రౌండ్‌లో వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

పెదగంట్యాడ: రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'ఆడుదాం-ఆంధ్రా' క్రీడాపోటీలు రెండో రోజు బుధవారం కూడా ఉత్సాహంగా సాగాయి. పెదగంట్యాడ మండల పరిధిలో నిర్వహించిన పలు పోటీల్లో 40 జట్లు పాల్గొన్నాయని జీవీఎంసీ జోన్–6 జోనల్ కమిషనర్ పి.సింహాచలం తెలిపారు.

- పెదగంట్యాడ సచివాలయం–2 పరిధిలోని నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పోటీలను 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి ప్రారంభించారు. ఇక్కడ బ్యాడ్మింటన్, కబడ్డీ, క్రికెట్ పోటీలు నిర్వహించారు.
- యారాడ సచివాలయం పరిధిలో రాజీవ్ ఇండోర్ స్టేడియంలో బ్యాడ్మింటన్ పోటీలు, గాంధీనగర్ సచివాలయం పరిధిలో క్రికెట్, వాలీబాల్ పోటీలు నిర్వహించారు.
- ఆదర్శగ్రౌండ్‌లో క్రికెట్ పోటీలు నిర్వహించారు.

86వ వార్డులో..

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 86వ వార్డు ఐలా గ్రౌండ్‌లో ఆడుదాం ఆంధ్ర క్రికెట్ పోటీలను జెడ్సీ సింహాచలం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ క్రీడాకారుల్లో నైపుణ్యాన్ని గుర్తించి, ప్రోత్సహించాలనే ఉద్దేశంతో రాష్ట్ర వ్యాప్తంగా ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రతిభను చాటేందుకు క్రీడాకారులకు ఆడుదాం ఆంధ్రా మంచి వేదిక అవుతుందన్నారు. కార్యక్రమంలో వార్డు స్పెషల్ ఆఫీసర్ రామనారాయణ, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

భెల్ మైదానంలో..

అక్కిరెడ్డిపాలెం: భెల్ క్రీడా మైదానంలో నిర్వహించిన క్రికెట్ పోటీల్లో శ్రీనివాసనగర్, కాపుతుంగ్లాం, రెడ్డితుంగ్లాం, సత్తివానిపాలెం సచివాలయాల పరిధిలో 8 జట్లు పాల్గొన్నాయని పీడీ పి.సత్యకుమార్ తెలిపారు. జెడ్సీ సింహాచలం, నిర్వాహకులు, సచివాలయాల ఉద్యోగులు క్రీడాపోటీలను పర్యవేక్షించారు.

వెంకన్న ఆలయంలో ధనుర్మాస పూజలు

అగనంపూడి: ధనుర్మాసాన్ని పురస్కరించుకుని అగనంపూడి శాంతినగర్ కాలనీలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు సత్యనారాయణ ఆచార్యులు 12వ పాశురాన్ని వినిపించి, విశిష్టతను తెలియజేశారు. ఆలయ ధర్మకర్త ఈ.కె.చారి దంపతులు పాల్గొని పూజలు చేశారు.

సంక్షేమం, అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలి

వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్త ఉరుకూటి చందు



నాయకులతో మాట్లాడుతున్న చందు

అగనంపూడి: ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లే బాధ్యత మనందరిపై ఉందని వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్త ఉరుకూటి రామచంద్రరావు (చందు) అన్నారు. 85వ వార్డు కొండయ్యవలసలో కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ముఖ్య నాయకుల పరిచయ కార్యక్రమం, సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చే సాధారణ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని విజయ తీరానికి చేర్చే బాధ్యత ప్రతీ నాయకుడు, కార్యకర్తపై ఉందన్నారు. ప్రజల కోసం మన ప్రభుత్వం చేసిన కార్యక్రమాలు వివరిస్తే విజయం తథ్యమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సేవాదళ్ ప్రధాన కార్యదర్శి ఇల్లపు ప్రసాద్, గాజువాక జేసీఎస్ క్లస్టర్ ఇన్‌చార్జి వాడపల్లి రామచంద్రరాజు, సీనియర్ నాయకులు బోర సోమునాయుడు, పెదిరెడ్ల హరీష్, బలిరెడ్డి శ్రీను, ఇల్లపు వాసు, సాలాపు అచ్చిబాబు, పిల్లా కొండలరావు, గెద్దాడ సత్యవతి, విందుల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

'ఐక్య ఉద్యమాలను దెబ్బ తీయవద్దు'

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం జరుగుతున్న ఐక్య ఉద్యమాలను దెబ్బ తీయవద్దని స్టీల్ ఇంటక్ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్ కోరారు. సెంట్రల్ స్టోర్స్ కూడలి వద్ద బుధవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిందాల్ అంశంపై మొదటి నుంచి కార్మిక సంఘాలు యాజమాన్యం నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ వచ్చాయన్నారు. పోరాట కమిటీ సమావేశంలో చేసిన నిర్ణయం మేరకు అడ్మిన్ బిల్డింగ్ ముట్టడి చేపట్టామన్నారు. కార్మిక సంఘాలు, పోరాట కమిటీపై కొంతమంది లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని, అటువంటి ఆరోపణలు పోరాటానికి నష్టం కలిగిస్తాయన్నారు. యాజమాన్యం జిందాల్ ఒప్పందాన్ని రద్దు చేయడం, కార్మికులకు వేతన సవరణ చేయడం తదితర డిమాండ్లపై పోరాటం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో బి.ఎస్. రాజు, బీఎంకె నాయక్, రమణమూర్తి, వెంకటరాజు, జి.ప్రభాకరరెడ్డి, కామరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

గాజువాక: కేఎన్నార్ ఫౌండేషన్, స్ఫూర్తి హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన లభించింది. గాజువాక హైస్కూల్ రోడ్‌లో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని గాజువాక బీజేపీ కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గాజువాకలోని అన్ని వార్డుల్లో ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. అనంతరం బీపీ, షుగర్, దంత, వినికిడి సమస్యలపై 220 మందికి వైద్య సేవలను అందించినట్టు నిర్వాహకులు చెప్పారు. కార్యక్రమంలో మెడికవర్ ఆస్పత్రి వైద్యులు ధనుష్, రవి కుమార్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

'ప్రకృతి వనం' ప్రారంభం



పార్కును ప్రారంభిస్తున్న స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ స్టీల్ మెల్ట్ షాప్–1లో ప్రకృతి వనం పార్కును స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్ బుధవారం ప్రారంభించారు. విభాగంలో ఉన్న పాత డంపింగ్ యార్డును ఉద్యోగులు ఇతర విభాగాల సహకారంతో పార్కుగా అభివృద్ధి చేశారు. ఈ సందర్భంగా సీఎండీ భట్ మాట్లాడుతూ విభాగంలోని స్క్రాప్‌ను వినియోగించి అందమైన పార్కుగా తీర్చిదిద్దడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా ఆయన తరంగ్ వాటర్ ఫౌంటెన్‌ను, డైరెక్టర్ (ప్రాజెక్ట్స్) బాగ్చీ లెహర్ ఫౌంటెన్‌ను ప్రారంభించారు. పార్కులో మొక్కలు నాటారు. కార్యక్రమంలో సీజీఎం (వర్క్స్) ఎన్.వి.స్వామి, ఇతర సీజీఎంలు ఎ.కె. సోబ్తీ, యు.శ్రీధర్, ఎస్.ఎం.ఎస్ విభాగం సీజీఎం పి.ఎస్.రావు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ జీఎం దుర్గాప్రసాద్‌కు సత్కారం



జీఎం దుర్గాప్రసాద్‌ను సత్కరిస్తున్న ఇంజినీరింగ్ షాప్స్ ఉద్యోగులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కోక్ ఓవెన్స్ విభాగాధిపతి, జనరల్ మేనేజర్ ఎం.వి.ఎస్.దుర్గాప్రసాద్‌ను ఉద్యోగులు బుధవారం ఘనంగా సత్కరించారు. ఇంజినీరింగ్ షాప్స్ అండ్ ఫౌండ్రీ విభాగాధిపతిగా విధులు నిర్వహించి, కోక్ ఓవెన్స్ విభాగానికి బదిలీ అయిన దుర్గాప్రసాద్‌ను ఇంజినీరింగ్ షాప్స్‌లో జరిగిన కార్యక్రమంలో సన్మానించారు. ఇంజినీరింగ్ షాప్స్ నూతన విభాగాధిపతి పాండే మాట్లాడుతూ విభాగం అభివృద్ధికి దుర్గాప్రసాద్ ఎనలేని కృషి చేశారన్నారు. ఆయన బాటలోనే నడిచి ప్లాంట్‌కు తగిన సేవలు అందిస్తామన్నారు. సన్మాన గ్రహీత దుర్గాప్రసాద్ మాట్లాడుతూ తనకు ఇంజినీరింగ్ షాప్స్‌తో విడదీయరాని అనుబంధం ఉందన్నారు. తనకు సహకరించిన ఉద్యోగులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో విభాగం అధికారులు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక చర్యలు



ఇంటింటా చెత్తను సేకరిస్తున్న సిబ్బంది

గాజువాక: జీవీఎంసీ గాజువాక జోన్‌లో పారిశుధ్య నిర్వహణకు ప్రజారోగ్య విభాగం అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. అదనపు కార్మికులను ఏర్పాటు చేసి ఇంటింటా చెత్త సేకరణకు బుధవారం శ్రీకారం చుట్టారు. పారిశుధ్య కార్మికులు, క్లాప్ వాహనాల కార్మికులు సమ్మెలో ఉండటంతో ఇంటింటా చెత్త సేకరణ నిలిచిపోయింది. దీనిపై సమీక్షించిన జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని జోనల్ అధికారులను ఆదేశించడంతో గాజువాక ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. జీవీఎంసీ వాహనాలను ఇంటింటికీ పంపించి చెత్తను సేకరించడంతో పాటు వివిధ ప్రాంతాల్లో శుభ్రత పనులు నిర్వహించారు.

30న విగ్రహాల ఆవిష్కరణ

పెదగంట్యాడ: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్, మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలను ఈ నెల 30న పెదగంట్యాడ ఫైర్ స్టేషన్ సెంటర్‌లో ఆవిష్కరించనున్నామని డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు గంట్యాడ గురుమూర్తి, మార్టుపూడి పరదేశి తెలిపారు. విగ్రహాల ఆవిష్కరణకు సంబంధించిన పోస్టర్‌ను దుర్గవానిపాలెం కమ్యూనిటీ హాల్‌లో బుధవారం ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ విగ్రహాలను ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, బాపట్ల ఎంపీ నందిగామ సురేష్, మంత్రులు తానేటి వనిత, మేరుగు నాగార్జున, ఆదిమూలపు సురేష్, నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కనకారావు తదితరులు ఆవిష్కరిస్తారన్నారు. కార్యక్రమంలో గంట్యాడ గోవిందరాజు, సోమునాయుడు, పైడిరాజు, పెంటారావు, రాములు, వెంకట్రావు, డాక్టర్ ఎస్.రాజారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉక్కు ఆస్పత్రి ఆవిర్భావ దినోత్సవం



విజేత జట్టుకు ట్రోఫీ అందిస్తున్న ఉక్కు ఆస్పత్రి విభాగాధిపతి ప్రకాశ్, అతిథులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ జనరల్ ఆస్పత్రి ఆవిర్భావ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. జనరల్ ఆస్పత్రిలో నిర్వహించిన కార్యక్రమానికి స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (ప్రాజెక్ట్స్) ఎ.కె. బాగ్చీ, హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రి డైరెక్టర్ ఉమేష్ మహంత్ శెట్టి, విజయ డయాగ్నస్టిక్స్ వైద్యులు డాక్టర్ ఎస్.సంతోష్ అతిథులుగా హాజరయ్యారు. డైరెక్టర్ బాగ్చీ మాట్లాడుతూ ఉక్కు ఉద్యోగులు, వారి కుటుంబీకులకు ఆస్పత్రి విశిష్టమైన సేవలు అందిస్తోందన్నారు. ఉక్కు జనరల్ ఆస్పత్రి సీజీఎం డాక్టర్ కె.హెచ్. ప్రకాశ్ మాట్లాడుతూ వైద్యులు మరింత అంకితభావంతో సేవలు అందించాలన్నారు. ఈ సందర్భంగా ఏటా బెస్ట్ డాక్టర్‌కు ఇచ్చే కొప్పర్తి కృష్ణమూర్తి బంగారు పతకాన్ని ఆస్పత్రి వైద్యులు డాక్టర్ సౌజన్యకు, బెస్ట్ నర్స్‌కు ఇచ్చే లక్ష్మీ ప్రభాకర్ రజత పతకాన్ని సిస్టర్ అన్నపూర్ణకు ప్రదానం చేశారు. కార్యక్రమంలో భాగంగా ఆవిర్భావ దినోత్సవ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి జీఎంలు డాక్టర్ ఎ.పి. నవీన్‌కుమార్, డాక్టర్ ఎస్.ఎన్. సారంగి, మెడికల్ కమిటీ ప్రతినిధులు ముసినాడ శ్రీనివాస్, ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నూతన నియామకం



జయలక్ష్మికి నియామక పత్రం అందిస్తున్న సత్యనారాయణ

అగనంపూడి: గ్లోబల్ హ్యూమన్ రైట్స్ అవేర్‌నెస్ అసోసియేషన్ (గ్రా) ఉత్తరాంధ్ర ప్రాంతీయ విభాగం మహిళా అధ్యక్షురాలిగా అగనంపూడికి చెందిన దాసరి వెంకట జయలక్ష్మిని నియమించినట్టు గ్రా ఉత్తరాంధ్రా రీజనల్ కో–ఆర్డినేటర్ ఎలుగుబంటి సత్యనారాయణ తెలిపారు. అగనంపూడిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమెకు నియామక పత్రం అందించారు. గ్రా జిల్లా అధ్యక్షుడు మోటూరి వెంకటరమణ, నాయకులు పాల్గొన్నారు.

రూ.35 లక్షలతో రోడ్లు, కాల్వల నిర్మాణం

73వ వార్డులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి, కార్పొరేటర్ సుజాత

పెదగంట్యాడ: నియోజకవర్గంలోని అన్ని వార్డులను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తున్నామని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. 73వ వార్డు కొత్త కర్ణవానిపాలెం, వినాయకనగర్ వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంతాల్లో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణ పనులకు బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వార్డులో మొత్తం రూ. 35 లక్షలతో రోడ్లు, కాలువలు నిర్మిస్తున్నామని చెప్పారు. కార్పొరేటర్ భూపతిరాజు సుజాత మాట్లాడుతూ వార్డులోని అన్ని ప్రాంతాల్లో రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి వినియోగంలోకి తీసుకువస్తామన్నారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి కులుకూరి మంగరాజు, భూపతిరాజు శ్రీనివాస్, చవాకుల అప్పలరాజు, విరోతి భాస్కర్, కరణం కనకారావు, దాసరి పైడిరాజు, కరణం పైడిరాజు, జనపరెడ్డి పార్వతి, గొన్నా రామారావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆధార్ క్యాంప్ ప్రారంభం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో ఏర్పాటు చేసిన స్పెషల్ ఆధార్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలని 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు తెలిపారు. స్పెషల్ క్యాంప్‌ను సెక్టార్–1 కాంప్లెక్స్‌లోని స్థానిక సచివాలయంలో బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బుధవారం ప్రారంభమైన ఈ ఆధార్ క్యాంప్ జనవరి 6 వరకు కొనసాగుతుందన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించనున్న క్యాంప్‌లో మొబైల్ నెంబర్, అడ్రస్ మార్పు, పుట్టిన తేదీ, బయోమెట్రిక్, ఫొటో అప్‌డేట్, ఆధార్ కార్డ్ అప్‌డేట్ వంటివి చేస్తారని తెలిపారు.

సెయిల్‌తో ఎంవోయూ చేయాలి



ఉక్కు అడ్మిన్ కూడలి వద్ద ధర్నాలో మాట్లాడుతున్న నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ జిందాల్‌తో కాకుండా సెయిల్‌తో ఎంవోయూ చేయాలని స్టీల్‌ప్లాంట్ నాన్ జేసీఎం (ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, సిటూయేతర) కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. నాన్ జేసీఎం సంఘాల ఆధ్వర్యంలో ఉక్కు అడ్మిన్ కూడలి వద్ద బుధవారం చేపట్టిన ధర్నాలో నాయకులు మాట్లాడారు. జిందాల్‌తో ఒప్పందం ప్లాంట్‌కు నష్టదాయకమన్నారు. ప్రభుత్వ రంగ సంస్థ సెయిల్‌తో ఒప్పందం చేస్తే ఇరు సంస్థలకు లాభదాయకమన్నారు. జిందాల్ ఎంవోయూ వ్యవహారంలో ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, సిటూ పై కార్మికుల్లో అనేక అనుమానాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో వై.మస్తానప్ప, జి.గణపతిరెడ్డి, కొమ్మినేని శ్రీనివాసరావు, వరసాల శ్రీనివాసరావు, డి.వి.రమణ, కరణం సత్యారావు తదితరులు పాల్గొన్నారు.